క్లుప్తంగా

లయన్స్ క్లబ్ జోన్‌చైర్మన్‌గా బాపు


దేగ బాపు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్‌గా హాజీపూర్ మండల వేంపల్లి గ్రామానికి చెందిన దేగ బాపు నియామకం అయ్యారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ హన్మాండ్లరెడ్డి బుధవారం తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యుడిగా అందిస్తున్న సేవలను గుర్తిస్తూ 2023–24 సంవత్సరానికి జోన్ చైర్ పర్సన్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే


లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని రాజేశ్వర్‌రావుపల్లెలో రూ.2లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్‌ను బుధవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు, జడ్పీ కో ఆప్షన్ సహీంపాషా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాయికుంట చెరువు హద్దుల పరిశీలన


చెరువు హద్దులను పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని సాయికుంట చెరువును సుందరీకరణ అభివృద్ధి పనుల పేరిట స్థానిక నాయకులు కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు, ఫిర్యాదులతో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మొత్తం 8.17 ఎకరాల వరకు చెరువు ఉంటుందని స్థానికులు చెబుతుండగా, చెరువు హద్దులను గుర్తించడంతో పాటు, ఎంత మేరకు కబ్జాకు గురైందనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. తహసీల్దార్ రాజేశ్వర్, ఇరిగేషన్ ఏఈ గౌతమ్, సర్వేయర్ ప్రసాద్, ఆర్ఐ అజీస్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, టిపివో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటి పట్టాల సమస్య తీర్చిన ఘనత బీఆర్ఎస్‌దే


లబ్ధిదారులకు ఇంటి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి పుర ప్రజలకు ఇంటి పట్టాలు ఇప్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 2వ వార్డు ప్రజలకు ఇళ్లపట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాన్ని ఏలిన ఏ ప్రభుత్వం కూడా ఇళ్ల పట్టాలు ఇప్పించలేకపోయిందన్నారు. అసెంబ్లీలో పలు మార్లు ప్రస్తావించి, ప్రత్యేకంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ఇళ్ల పట్టాల సమస్యను తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి మార్గం దొరికిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్ అప్సర్ ఉన్నారు.

మంత్రిని కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు


మంత్రికు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను జిల్లాలోని మున్నూరు కాపు సంఘం నాయకులు బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తుల వారికి ఇస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయ పథకం మున్నూరు కాపులకు సైతం ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు గొంగ్లళ్ల శంకర్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మెన్ పల్లే భూమేష్, నాయకులు జగ్గరీ సంజీవ్, గోపి ఉన్నారు.

వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట


చెన్నూర్: వైద్య ఆరోగ్య దినోత్సవంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్


బెల్లంపల్లి: న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

- అదనపు కలెక్టర్ రాహుల్

చెన్నూర్: తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి వైద్య ఆరోగ్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు అదనపు కలెక్టర్ రాహుల్ ముఖ్య అతిథిగా హజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవాలందించేందుకు ప్రభుత్వం సమూల మార్పులు చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో 30 పడకల ఆస్పత్రితో పాటు 100 ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు, డీఆర్‌డీవో శేషాద్రి, మున్సిపాల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ పోగుల సతీశ్, కమ్మల శ్రీనివాస్, ఎంపీపీలు మంత్రి బాపు, సురేఖ, జడ్పీటీసీ తిరుపతి, మున్సిపాల్ కమిషనర్ గంగాధర్, వైద్యులు సత్యనారాయణ ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

చెన్నూర్ మండలంలోని ఎల్లక్కపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, మున్సిపాల్ వైస్ చైర్మన్ నవాజ్, కిష్టంపేట సర్పంచ్ రాకేశ్, వైద్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్యుల సంబురాలు

లక్సెట్టిపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను మండలంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో వైద్యులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, వైద్యులు శ్రీనివాస్, శేఖర్ లు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యం..

బెల్లంపల్లి: ప్రజలను ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. పద్మశాలి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బెల్లంపల్లి డివిజన్‌లో నాలుగు లక్షల మంది ప్రజలకు 400 మంది సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఏరియా ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలు చేసి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కిరణ్‌కుమారిని ఎమ్మెల్యే శాలువతో సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా వైద్యవిధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ అరవింద్, ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, జెడ్పీ సీఈవో నరేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్ పాల్గొన్నారు.


లక్సెట్టిపేట: పండ్లు పంపిణీ చేస్తున్న నాయికులు

రోగులకు పండ్లు పంపిణీ

బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు వైద్యాధికారులతో కలిసి ఎమ్మెల్యే చిన్నయ్య పండ్లు పంపిణీ చేశారు. వైద్యవిధాన పరిషత్ జిల్లా కోఆరినేటర్ డాక్టర్ అరవింద్, బెల్లంపల్లి ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సెలర్ బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికే డాక్టర్ రాజరమేశ్?


శ్రీనివాస్‌రెడ్డితో రాజరమేశ్ (ఫైల్)

రామకృష్ణాపూర్: చెన్నూర్ నియోజకవర్గంలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. డాక్టర్ రాజరమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరటం దాదాపుగా ఖరారు అయ్యింది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పార్టీలో చేరాలని ఆయన భావిస్తున్నారు. మరో వారం రోజుల్లో తన చేరికపై రాజరమేష్ స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ ఇప్పిస్తానని పొంగులేటి హామీ ఇచ్చిన దరిమిలా కాంగ్రెస్‌లో చేరిక ఇక లాంఛనప్రాయమే అని అంటున్నారు. దీంతో కొన్ని నెలల ఉత్కంఠకు తెరపడినట్లయింది. ఇప్పటికే ఐదారుగురు ఈ అసెంబ్లీ సెగ్మెంట్ ఆశిస్తుండటం..రాజరమేష్ చేరికతో తాజా రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో అనే సందేహాలు సహజంగానే వ్యక్తమవుతున్నాయి. రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా మొన్నటి వరకు పనిచేసిన డాక్టర్ రాజరమేష్ ఎట్టకేలకు రాజకీయ ఆరంగేట్రం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో తన సింగరేణి ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఇందుకు దాదాపుగా రంగం సిద్ధం చేసుకున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావిస్తున్న రాజరమేష్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని సమాచారం. కాగా రాజరమేష్ ప్రస్తుతం జీఎస్ఆర్ ఫౌండేషన్ స్థాపించి దానికి వ్యవస్థానక అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

డీటీడీవో ఉద్యోగుల గైర్హాజరు


సిబ్బంది లేక వెలవెలబోతున్న కార్యాలయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం ఉద్యోగులు లేక, కేవలం ముగ్గురు ఉద్యోగులతోనే కార్యాలయ నిర్వహణ చేపట్టారు. జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి నీలిమ హైదరాబాద్‌లోని తన గృహ ప్రవేశ కార్యక్రమానికి కార్యాలయం సిబ్బందిని ఆహ్వానించగా ముకుమ్మడిగా కార్యాలయంలోని సిబ్బంది సెలవు అనుమతి లేకుండానే హైదరాబాద్‌కు వెళ్లిపోవడంతో కార్యాలయం వెలవెలబోయింది. కార్యాలయంలో ఒక ఏవో, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ తప్ప ఎవరూ లేకపోవడం గమనార్హం. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం, ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీల నియామకం, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో అడ్మిషన్లు, పోడు భూములకు సంబంధించిన పలు అంశాలపై కార్యాలయంకు వచ్చిన వారు, సిబ్బంది లేకపోవడంతో నిరాశ చెందారు. ఈ విషయమై తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సెడ్మకి భీంరావులు మాట్లాడుతూ 8 మంది ఉద్యోగులకు గాను కేవలం ఇద్దరు మాత్రమే కార్యాలయంలో పనిచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు మూకుమ్మడిగా కార్యాలయానికి రాకపోవడంపై ఏటీడీవో చిరంజీవిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో బుధవారం హరీష్ మెమోరియల్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన భాగ్యం లేదన్నారు. ప్రతిరోజు యువకులు క్రీడలు ఆడటం, వ్యాయామం చేయడంతో ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, తాండూర్ ఎంపీపీ ప్రణయ్‌కుమార్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

'మున్సిపాలిటీకి నిధులు ఇవ్వలేదెందుకు'


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: సీఎం కేసీఆర్ గద్వాల్, నిర్మల్ జిల్లాల్లో పర్యటించి, అక్కడి మున్సిపాలిటీలకు నిధులను ప్రకటించారని, మంచిర్యాల పర్యటనలో మాత్రం మంచిర్యాల మున్సిపాలిటీకి రూ.25కోట్ల నిధులను ఎందుకు ప్రకటించలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో బుధవారం పర్యటించి, వార్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల సింగరేణి ప్రాంతం నుంచి వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్న ఆ నిధులను జిల్లాలో ఖర్చు పెట్టకుండా, ఇతర పథకాలకు తరలించి జిల్లా అభివృద్ధిని కేసీఆర్ అడ్డుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్ వర్ధన్, జోగుల శ్రీదేవి, బల్ల రమేశ్, కంకణాల సతీశ్, శివశంకర్, రంగ శ్రీశైలం, ముదాం మల్లేశ్, అమిరిశెట్టి రాజు, సాయికిరణ్ పాల్గొన్నారు.

గొప్ప ఆధ్యాత్మిక వేత్త సేవాలాల్


సేవాలాల్ ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: లంబాడీ కులస్తుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం మారుమూల గ్రామంలో నిర్మించడం అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం జన్నారం మండలం బంగారుతండాలో జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రతీ గ్రామంలో సౌకర్యాలు కల్పించామని, ఆలయాలకు మహర్దశ వచ్చిందని తెలిపారు. ఆలయానికి ఇప్పటికీ వరకు ప్రభుత్వం నుంచి రూ.20లక్షలు మంజూరు చేయడం జరిగిందని, మరో రూ.5లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హస్లీబాయి, జెడ్పీటీసీ చంద్రశేఖర్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, ఆలయ కమిటీ చైర్మన్ బోడ మణిరాం, వైస్ చైర్మన్ బోడ రాజు, బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు వెడ్మ బొజ్జు, మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పూర్ణచందర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు తిరుపతినాయక్, బన్సీలాల్, బిల్యానాయక్, రాందాస్, జలపతి, రవి, విజెందర్, శంకర్, రెడ్డి, జలపతి పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మంచిర్యాలక్రైం: నేటి సమాజంలో విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. బుధవారం ఆయన మంచిర్యాల ఎస్సీ వసతి గృహంలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లడతూ విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

'పనిముట్లు సరిగా లేక ఇబ్బందులు'

కాసిపేట: కార్మికులకు సరైన పనిముట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐఎన్‌టీయూసీ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య విమర్శించారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిని బాడిబాటలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేస్‌వర్క్ కార్మికులకు సరైన పనిముట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని లైన్‌మెన్ కార్మికులకు సైతం పనిముట్లు నాణ్యంగా ఉండడం లేదన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన కార్మికుల సమస్యలపై స్పందించడం లేదని కార్మికులు వాపోతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఏరియా సెక్రెటరీ చంద్రశేఖర్, బత్తుల వేణు, బండ భాస్కర్, ఫిట్ కార్యదర్శి రవీందర్, ఏరియా నాయకులు కారుకూరి తిరుపతి, దేవ రమేష్, బాల్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిలిచిన ఆన్‌లైన్ సేవలు


కార్యాలయంలో పేరుకుపోయిన సర్టిఫికెట్లు

మందమర్రిరూరల్: తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజులుగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయానికి ధ్రువపత్రాల కోసం వచ్చిన వారికి సకాలంలో ధ్రువపత్రాలు అందక ఆఫీస్ వద్దనే పడిగాపులు కాస్తున్నారు. బీసీ కులస్తులకు ప్రభుత్వం లోన్ ఇవ్వడానికి దరఖాస్తుకు ఈ నెల 20వ తేదీ చివరిదిగా ప్రకటించింది. అలాగే స్కూల్ తెరవడంతో ఉన్నత చదువులకు పాఠశాలల్లో ధ్రువ పత్రాల అందజేయాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్లకు సర్వర్ ప్రాబ్లం..

జైపూర్: కులం, ఆధారం, నివాసం సర్టిఫికెట్ల కోసం ఇటు విద్యార్థులు అటూ బీసీ కులాల కులవృత్తిదారులు తంటాలు పడుతున్నారు. జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించగా సర్వర్ ప్రాబ్లంతో సర్టిఫికెట్లు జనరేట్ కాక ఇబ్బందులు పడుతున్నారు. రెండ్రోజులుగా సర్వర్ మొత్తమే పని చేయకపోగా బుధవారం కొంచం సర్వర్ పనిచేసినట్లుగా తహసీల్దార్ మోహన్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 1000దరఖాస్తుల వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది.

రక్తదానం చేయాలి

బెల్లంపల్లిరూరల్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బెల్లంపల్లి డివిజన్ కన్వీనర్ సురభి శరత్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని లంబాడితండా, బుధాకలాన్ గ్రామాల్లో గ్రామస్తులకు, కార్మికులకు హైజనిక్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కో–కన్వీనర్ గజెల్లి మోహన్, సభ్యుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ రాయమల్లు, జేపీఎస్‌లు శిరీష, హరికృష్ణ ఉన్నారు.

పునాది అక్షరాస్యతపై ఆన్‌లైన్ వర్క్‌షాప్


మంచిర్యాలఅర్బన్: విద్యా ప్రమాణాల మెరుగుదల, గుణాత్మక మార్పు కోసం అమలుచేస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై నోడల్ అధికారి, మంచిర్యాల కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ సుభాషిణీ ఆధ్వర్యంలో బుధవారం ఆన్‌లైన్‌లో జన్ భాగీదారి వర్క్‌షాప్ నిర్వహించారు. పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం నిర్ధారించటం అనే అంశంపై హైదరాబాద్ తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయం హెచ్ఎం సాయి పద్మ వివరించారు. ఎఫ్ఎల్ఎన్ విజయవంతంగా అమలు చేయడంలో నాయకత్వ పాత్రపై క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దండేపల్లి మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి డాక్టర్ పర్వతి సత్యనారాయణ, టెక్నికల్ సపోర్టర్ భాస్కర్‌తో పాటు, ఉషోదయ, కార్మెల్ హైస్కూల్, సెవెన్స్ హిల్స్, దండేపల్లి ఎంపీయూపీఎస్‌కు చెందిన వంద మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల గ్రామ శివారులో కొండ పోచమ్మ, అగడు పోచమ్మ, పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠాపన ముగిసిన అనంతరం గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంబాల, పోతరాజుల ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ సునితా కిషన్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, సభ్యులు వెంకటరామయ్య, మల్లేష్, ప్రభాకర్, గురవయ్య, కాటం రాజేష్, చిట్ల దివాకర్, సుగణాకర్ ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ



ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీవెంకటేశ్వర శివపంచాయతన, ఆంజనేయ ధ్వజపూర్వక, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వేదమంత్రాలు, మేళతాళాలు భక్తుల కోలాహలం మధ్య నూతన ధ్వజస్తంభ స్థాపన చేశారు. అచ్చలాపూర్ శ్రీ మహదేవ వేద పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుద్దిల మనోహర అవదాని, గట్టు నరహరిశర్మ ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. శాంతి కల్యాణం నిర్వహించారు. కన్నెపల్లి మాలీ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌లతో కలిసి నూతన దేవాలయంలోరి ముఖ మండపాన్ని ప్రారంభించారు.

మొక్కల రక్షణకు చర్యలు

భీమారం: హరితహారం కింద గ్రామపంచాయతీల ద్వారా పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని జిల్లా పంచాయతీ అధికారి వెంటకేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా భీమారం గ్రామపంచాయతీలో చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆయన తనిఖీ చేశారు. ముఖ్యంగా వర్షాలు రాని కారణంగా ప్రతీ నర్సరీలోని మొక్కలకు ప్రతిరోజు రెండుసార్ల నీటిని అందించాలని తెలిపారు. డంపింగ్ యార్డుని తనిఖీ చేసిన డీపీవో దానిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఎంపీవో సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

రీడింగ్ రూమ్స్ ఏర్పాటుకు తీర్మానం


మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్

మంచిర్యాలఅర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ మంచిర్యాల పరిధిలోని పలు పంచాయతీల్లో పౌర పఠన మందిరం (పబ్లిక్ రీడింగ్ రూమ్స్) ఏర్పాటు చేసేందుకు బడ్జెట్ కేటాయించాలని తీర్మానించారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారం, దండెపల్లిలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించే గ్రంథాలయ భవన డీపీఎల్‌ని అడ్మినిస్ట్రేటివ్‌కు పంపించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సంచాలకులచే ఆమోదించిన ప్రకారం రూ. 10లక్షలతో నూతన పుస్తక కొనుగోలు కోసం ప్రతిపాదనలు అందజేశారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, సభ్యులు వెంకటేశ్వర్లు, గ్రంథాలయ కార్యదర్శి రాజు ఉన్నారు.

నూతన నియామకం

నస్పూర్: బీజేపీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అగల్‌డ్యుటి రాజు బీజేపీ రాష్ట్ర కార్యావర్గ సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా రాజు మాజీ ఎంపీ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.